సాక్షి
వికారాబాద్
గురువారం, 7, నవంబర్, 2024



పైరవీలు.. అభ్యర్థనలు

పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. త్వరలో జీపీ ఎన్నికలు జరగనుండటంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. 10లో▸



మహిళల భద్రతే ముఖ్యం

మహిళలు, బాలికల భద్రత కోసమే షీ టీం ఏర్పాటు చేశారని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 10లో▸



మైనర్లకు వాహనాలు..

మైనర్లకు వాహనాలు ఇవ్వొదని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీజీ శీతల్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



తాండూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులో గల సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీల్ కుమార్ సాహోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలోని రైల్వే లైన్ విభాగంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, బూట్లు, సబ్బులు, హెల్మెట్లు ఇవ్వడం లేదన్నారు. వీటిని అడిగిన ప్రతిసారీ యాజమాన్యం కంపెనీ నష్టాల్లో ఉందని తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ విషయాన్ని లేబర్ కమిషనర్ దృష్టికి తెచ్చినట్లు వివరించారు. స్పందించిన లేబర్ కమిషనర్ కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు ఎల్లప్ప, అంజిలప్ప, దస్తప్ప, హమీద్‌మియా తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి



కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో రఘుపతిరెడ్డి

అనంతగిరి: సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు యాక్టివ్‌గా ఉండాలి అని పీసీసీ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి సూచించారు. బుధవారం వికారాబాద్‌లో సోషల్ మీడియా నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సోషల్ మీడియాలో పనిచేసే వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలకు మనం వారధిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు యాదగిరి, విజయ్, సిద్దయ్య, నందు, శ్రీకాంత్, నరేందర్, భరత్, వెంకట్, తులసీదాస్, అశ్రఫ్ అలీ, మహేందర్, గ్రామ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. బుధవారం జీపీ కార్మికుల సమస్యలపై అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు, కార్మికులు మైపాల్, శ్రీనివాస్, సుమిత్ర, ఆశమ్మ, దస్తప్ప, వెంకటప్ప, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా పెంటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా పెద్దఅంబర్‌పేటకు చెందిన పంది పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీసెల్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం చేతుల మీదుగా బుధవారం పెంటయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో డీసీసీ ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతీ దళితుడికి చేరేలా కృషి చేస్తానన్నారు.

కదిలిన యంత్రాంగం

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ ప్రారంభం

- ఇళ్ల జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు
- జిల్లాలో కుటుంబాల సంఖ్య 2,63,362
- మరింత పెరిగే అవకాశం
- సర్వేకి 2,024 మంది ఎన్యూమరేటర్లు



కొడంగల్: కుటుంబ సర్వే ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కోసం సమస్త యంత్రాంగం కదిలింది. కుల గణన 9వ తేదీ నుంచి నిర్వహించనుండగా 8వ తేదీ వరకు ఆవాసాలు, బ్లాకుల వారీగా ఇళ్ల జాబితాను తయారు చేస్తారు. సర్వే కోసం అధికారులు వారం రోజులుగా కసరత్తు చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా సర్వేకు సిద్ధమయ్యారు. సీపీఓ వద్ద అందుబాటులో ఉన్న ప్రాథమిక లెక్కల ప్రకారం సర్వేకి అవసరమైన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎన్యూమరేటర్లు వారు సర్వే చేయాల్సిన ఇళ్లు, కుటుంబాల జాబితాను సిద్ధం చేసుకొని 8వ తేదీ సర్వే ఫారాల ప్రింట్లు తీసుకుంటారు. 9 నుంచి 21వ తేదీ వరకు 13 రోజుల పాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరిస్తారు. నెలాఖరుకు డాటా ఎంట్రీ పూర్తి చేసి రిపోర్టులు అందజేస్తారు.

పెరగనున్న కుటుంబాల సంఖ్య

2011 లెక్కల ప్రకారం జిల్లాలో 1,94,956 కుటుంబాలు.. 9.27 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం జిల్లాలో 2,63,362 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఇళ్ల జాబితాను సిద్ధం చేస్తుండటంతో కుటుంబాల సంఖ్య మరింత పెరిగి మూడు లక్షలు దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 585 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిని 2,027 బ్లాకులుగా విభజించారు. సర్వే కోసం 2,024 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వారికి శిక్షణ కూడా పూర్తి చేశారు. ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఐకేపీ సీసీలు, వీఏఓలు సర్వే విధుల్లో పాల్గొననున్నారు. పది ఇళ్లకు ఒకరు చొప్పున నియమిస్తారు. ఈ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు, ఎంపీడీఓలు, ఎంపీఈఓలు, స్థానిక సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అన్ని స్థాయిల అధికారులు, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ పర్యవేక్షిస్తారు.

పాఠశాలలకు ఇబ్బంది కలగకుండా..

ఇంటింటి కుటుంబ సర్వేను ముందు ఉపాధ్యాయులు లేకుండా నిర్వహించాలని భావించారు. ఆ తర్వాత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను తీసుకోవాలని నిర్ణయించారు. అయితే పాఠశాలలకు ఇబ్బంది లేకుండా టీచర్ల సేవలను మధ్యాహ్నం నుంచి వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం పత్తి తీత పనులు, ధాన్యం విక్రయాలు, ఇతర పంటల నూర్పిడులు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది సర్వేకి కొంత ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

భయపడాల్సిన అవసరం లేదు

పరిగి: కుటుంబ సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో, సుల్తాన్‌పూర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీఓ ఖరీం తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

సర్వే కోసం అన్ని చర్యలు తీసుకున్నాం. ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తి చేశాం. పూర్తిస్థాయిలో కుటుంబ వివరాలు సేకరించాలని ఆదేశించాం. సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తాం. సకాలంలో సర్వే ప్రక్రియను పూర్తిచేస్తాం.

– సుధీర్, అడిషనల్ కలెక్టర్

సర్వేకి సహకరించాలి

అనంతగిరి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇసాఖాన్ బాగ్ కాలనీలో, మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వేలో ప్రజల నుంచి సేకరించే వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్ కుమార్, ఎంపీవో దయానంద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

కొడంగల్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పరిశీలించారు. సర్వే సిబ్బందితో మాట్లాడారు. సర్వే చేస్తున్న విధానాన్ని గమనించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను వివరంగా తీసుకోవాలన్నారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని పదో వార్డులో సర్వేని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా వివరాలు సేకరించాలన్నారు. 8వ తేదీ నాటికి ఇళ్ల జాబితాను సిద్ధం చేసి స్టిక్కర్లు అతికించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని అప్పాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

సత్వరం ప్రారంభించాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష

అనంతగిరి: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరం ప్రారంభించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 126 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 34, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 కేంద్రాల్లో సన్న రకం వడ్లు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆరబెట్టిన, చెత్త, తేమ లేకుండా ధాన్యం తేవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ధాన్యం నింపేందుకు గోనె సంచులు, తరలించేందుకు వాహనాలను సమకూర్చుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ తదితరులు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ

అనంతగిరి: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో సే టూ నో డ్రగ్స్ అనే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు కొంతమంది యువకులు జల్సాలకు, విలాసాలకు అలవాటు పడి మత్తు పదార్థాలు తీసుకోవడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని, కుటుంబాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటే క్రీడలు, సామాజిక కార్యక్రమాలపై శ్రద్ధ పెట్టాలన్నారు. కళాశాలల్లో, పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ సమావేశాల్లో, ప్రాథమిక, జిల్లా ఆస్పత్రుల్లో ప్రజలు, యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్రయాదవ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నిరోషా, కోఆర్డినేటర్లు రేణుకుమార్, జయరాం, రజిత, మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- పేకాట, రేవ్ పార్టీలు జరిగితే ఎస్ఐ, సీఐలదే బాధ్యత
- ఐజీ సత్యనారాయణ

నవాబుపేట: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పీఎస్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో భూ తగాదాలు, భూ సమస్యలు, కుటుంబ సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. నాలుగేళ్లలో క్రైమ్ రేటు బాగా తగ్గిందన్నారు. జీరో క్రైమ్ రేటు పీఎస్‌గా మార్చాల్సిన బాధ్యత ఇక్కడి సిబ్బందిపై ఉందన్నారు. పేకాట, రేవ్ పార్టీలు జరిగితే అందుకు ఎస్ఐ, సీఐలదే బాధ్యత అన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల లెక్క తేల్చండి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని దివ్యాంగుల లెక్క తేల్చాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న కులగణనలో దివ్యాంగుల సంఖ్యను సైతం తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయించి ఉపాధి, ఉద్యోగ రంగాలల్లో ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. గ్రామానికి పది చొప్పున దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ నాయక్, ప్రధాన కార్యదర్శి జి.యాదయ్య, ఎం.బాలరాజ్, ఎ.సంజీవ పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డీటీడీఓ రామేశ్వరి దేవి

కద్లాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమని జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి(డీటీడీఓ) రామేశ్వరి దేవి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, బాలుర వసతి వసతిగృహాలను ఏటీడీఓ వెంకటయ్యతో కలిసి సందర్శించారు. వసతిగృహం, ఆశ్రమ పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంట గది, పరిసరాలను పరిశీలించారు. వసతిగృహ సంక్షేమాధికారి రాములుతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామేశ్వరిదేవి మాట్లాడుతూ.. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా బోధన చేయాలని సూచించారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. భోజనంలో మెనూ పాటించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

ఆ పాఠశాల అదుర్స్

ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు చూసే రోజులివి.. సర్కారు బడికి పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు.. కానీ ఇందుకు భిన్నం కుదురుమల్ల ప్రాథమిక పాఠశాల. నాణ్యమైన బోధన, అత్యాధునిక వసతులు.. సమస్యలు లేకపోవడం ఆ స్కూల్ ప్రత్యేకత.. దీంతో తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కుదిరింది. ఇంకేముంది విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది..

- కుదురుమల్ల ప్రాథమిక పాఠశాలలో 144 మంది విద్యార్థులు
- మండలంలోనే అత్యధిక పిల్లలు కలిగిన బడిగా పేరు
- నాణ్యమైన బోధన.. అత్యాధునిక వసతులు
- ఆదర్శంగా నిలుస్తున్న సర్కారు స్కూల్

కుదురుమల్ల ప్రాథమిక పాఠశాల





తరగతి గదిలో నిండుగా విద్యార్థులు

దుద్యాల్: మండలంలోని కుదురుమల్ల ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు.. నాణ్యమైన విద్య అందిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 144 మంది విద్యార్థులు ఉన్నారు. మండలంలోనే అత్యధిక పిల్లలు కలిగిన పాఠశాలగా పేరు తెచ్చుకుంది. ఒకటో తరగతిలో 27 మంది విద్యార్థులు, 2వ తరగతిలో 26 మంది, 3వ తరగతిలో 22 మంది, 4వ తరగతిలో 34మంది, 5వ తరగతిలో 34 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో దాదాపు అన్ని వసతులు ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, చక్కటి భవనం, వంట గది, తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు అత్యాధునిక బల్లలు ఇలా ఎన్నో వసతులు ఉన్నాయి. ఇక చదువు విషయానికి వస్తే.. ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి పిరియడ్‌లో ఒక ఉపాధ్యాయుడు ఉంటాడు. చక్కటి బోధన అందుతోందని విద్యార్థులు తెలిపారు. ఇటీవల పాఠశాలకు కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించి సమస్యలపై ఆరా తీయగా ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌రెడ్డి తెలిపారు. దీంతో కడా అధికారి పాఠశాల సిబ్బందిని, హెచ్ఎంను అభినందించారు.

“అందరి సహకారంతోనే..



విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలను విజయవంతంగా నడుపుతున్నాం. ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులను మాన్పించి ఈ పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నాం. ఈ కారణంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

– నిరంజన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

పైరవీలు.. అభ్యర్థనలు

పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. దాదాపు తొమ్మిది నెలలుగా గ్రామాల్లో ప్రత్యేక పాలన సాగుతోంది. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనతో రాజకీయ ఆశావహుల్లో ఆశలు చిగురించాయి.

- గ్రామ పోరుకు మద్దతు ఇవ్వాలని పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆశావహుల లాబీయింగ్‌లు
- ఎటూ తేల్చుకోలేక పోతున్న అధిష్టానం
- అధికార పార్టీలో సమస్య తీవ్రం



దుద్యాల్‌ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్‌: గ్రామ పంచాయతీ ఎన్నికలు సంక్రాంతిలోపు పూర్తి చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం జోరందుకుంది. దుద్యాల మండల కేంద్రంతో పాటు హస్నాబాద్‌, హకీంపేట్‌, కుదురుమల్ల, పోలేపల్లి, లగచెర్ల, ఈర్లపల్లి, చిలుముల మైల్వార్‌, హంసంపల్లి వంటి మేజర్‌ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు రెండు నుంచి మూడు వర్గాలుగా విడిపోయి సర్పంచ్‌ టికెట్ల కోసం నాయకుల వద్ద లాబీయింగ్‌లు మొదలుపెట్టారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ముందుండి నడిపించిన నాయకులు ఒక వర్గంగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెద్దల హామీలతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు మరో వర్గంగా ఏర్పడి మద్దతు కోసం నేతల ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిత్యం ఏదో ఒక కాలనీలో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ మనకే టికెట్టు పక్కా అని ఎవరికి వారు ప్రచారాలు మొదలు పెట్టారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాన్ని



సక్రమంగా పాలించే మంచి నాయకుడు పోటీలో ఉంటే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయం పల్లెల్లో వ్యక్తం అవుతుంది. కానీ ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌గా బరిలో నిలవడానికి విపరీతమైన పోటీ నెలకొంది. పాలనపై అవగాహన లేని వారు కూడా పార్టీ పెద్దల మద్దతుతో పోటీ చేసేందుకు సిద్ధమవుతుండడం గమనార్హం. మండలంలో 23 గ్రామ పంచాయతీలున్నాయి.

సీఎం ఇలాకా కావడంతో..

దుద్యాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోని మండలం కావడంతో పక్కాగా కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థులు గెలుస్తారనే నమ్మకంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువకులు కూడా పోటీ చేయడానికి సిద్ధపడుతున్నారు. మండల స్థాయి నాయకుడి నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరకు ఏదో ఒక నాయకుడి వద్దకు నిత్యం గ్రామాల నుంచి వర్గాలు వెళ్లి మాకే టికెట్‌ ఇవ్వాలని బారులు తీరుతున్నారు. అంతటితో ఆగకుండా తెలిసిన పెద్ద నాయకుల ద్వారా లాబీయింగ్‌లు చేయడం సైతం ప్రారంభించారు. ప్రతి గ్రామం నుంచి రెండు, మూడు వర్గాలు పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడంతో ఎవరికి ఏం చెప్పాలో తెలియక తికమకపడుతున్నారు. అంతేకాకుండా నిత్యం గ్రామాల్లో గ్రూపు రాజకీయాలతో అధిష్టాన పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మరింత వాడి వేడిగా ఉండే అవకాశాలు లేకపోలేదు.

క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌కుమార్‌



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌

పరిగి: పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌కుమార్‌ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి తాను ఎప్పుడూ కృషి చేస్తానన్నారు. పట్టణవాసులు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను తీసుకువచ్చి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపిక



గోవర్ధన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్‌: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌(ఎస్‌జీఎఫ్‌) ఆధ్వర్యంలో ఈ నెల 1న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కీసరలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని మంబాపూర్‌ ఉన్నత పాఠశాలకు చెందిన గోవర్ధన్‌ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీ ఆర్‌.కృష్ణయ్య బుధవారం తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులతో పాటు గోవర్ధన్‌ను పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌, పీడీ కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఆనందం, సుధాకర్‌, ఆంజనేయులు, శ్రీనివాస్‌, శేఖర్‌, సురేఖ, నిర్మల, విజయలక్ష్మి, సంగీత, యాదమ్మ, మమత, నాజియా, ఎం.నిర్మల, గ్రామస్తులు అభినందించారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఆటల్లో ముందుడాలన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న మిట్టకోడూర్‌ గ్రామస్తులు

పరిగి: గ్రామ కంఠం భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాయాల్లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని మిట్టకోడూర్‌ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి కొందరు ఇళ్లను నిర్మించారన్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నత అధికారులు స్పందించి గ్రామ కంఠం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌వాసికి డాక్టరేట్‌



పీహెచ్‌డీ అందుకుంటున్న డాక్టర్‌ రాకేశ్‌ మెంగ్జీ

కొడంగల్‌ రూరల్‌: కొడంగల్‌ పట్టణంలోని ఇంద్రనగర్‌ కాలనీకి చెందిన డాక్టర్‌ రాకేశ్‌ మెంగ్జీ హైదరాబాద్‌లోని సీఎస్‌ఐఆర్‌–ఐఐసీటీలో సీనియర్‌ అసిస్టెంట్‌ డాక్టర్‌ అవిజిత్‌ జానా పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు. క్యాన్సర్‌ థెరప్యూటిక్స్‌లో ప్రాథమిక పరిశోధన, క్లినికల్‌ అప్లికేషన్ల మధ్య అంతర్యాన్ని తగ్గించగల సామర్థ్యం గుర్తించినందుకు పట్టా మంగళవారం అందజేశారని వివరించారు.

సీసీఐ కేంద్రంతో రైతులకు మేలు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొవాలని మర్పల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అయ్యప్ప కాటన్‌ మిల్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారుల బెడదను తప్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. జిల్లాలో 14 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు పత్తిలో తేమ శాతం నిబంధనల మేరకు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరకు క్వింటాల్‌కు రూ.7,521లు ఉందన్నారు. తేమ ఎక్కువగా ఉంటే ధర తగ్గుతుందన్నారు. అంతకు ముందు మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అంద జేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు మల్లేశం యాదవ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు శంకర్‌, నాయకులు సురేందర్‌, సిరాజోద్దీన్‌, మానయ్య, సుభాష్‌గౌడ్‌, ఒగ్గు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నూతన కమిటీ అవసరం



మాట్లాడుతున్న బీచ్యానాయక్‌, నాయకులు

కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌

కద్లాల్‌: మండల పరిధిలోని మైసిగండి ఆలయాభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి మండల ప్రజలను భాగస్వాములను చేయాలని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌, భక్తులు డిమాండ్‌ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం వేసిన కమిటీ పదవీకాలం పూర్తయినా నేటికీ నూతన కమిటీ ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆలయాభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తులతో పాటుగా మండల ప్రజలకు చోటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్‌లు చేగూరి వెంకటేష్‌, శ్రీనివాస్‌, సేవాలాల్‌ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్‌, నాయకులు యాదయ్య, సత్యంయాదవ్‌, దాస్‌, శ్రీకాంత్‌, జనార్ధన్‌గౌడ్‌, పారేశ్‌, జహంగీర్‌, రాజేందర్‌గౌడ్‌, రమేశ్‌, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్న వైనం

మొయినాబాద్‌: పూర్తిగా కుళ్లినస్థితిలో ఓ గుర్తు తెలియని మృతదేహం మొయినాబాద్‌లోని ముస్తాఫాహిల్‌ కాలనీ పరిసరాల్లో లభ్యమైంది. మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ముస్తాఫాహిల్స్‌ కాలనీ సమీపంలో అటుగా వెళ్లిన కాలనీవాసులకు పూర్తిగా కుళ్లిపోయిన వ్యక్తి(40) మృతదేహం కనిపించింది. తల, మొండెం వేర్వేరుగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి, నల్లగా మారి ఉంది. సుమారు ఇరవై రోజుల క్రితం మరణించి ఉండవచ్చని.. కుక్కలు పీక్కుతినడంతో తల, మొండెం వేర్వేరుగా అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తాం

యాలాల: టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావడం కోసం పార్టీ సభ్యత్వ నమోదును ఉద్యమంలా చేపడుతున్నట్లు ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్‌ కన్వీనర్‌ కట్టా వెంకటేష్‌గౌడ్‌ పేర్కొన్నారు. బుధవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు ఎర్ర హన్మంత్‌తో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల పార్లమెంట్‌ కో ఆర్డినేటర్‌ సుభాన్‌ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీకి దరఖాస్తులు

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని జినుగుర్తి గేటు మోడల్‌ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేందుకు ఏజెన్సీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం డ్వాక్రా మహిళా సంఘంలో ఉన్న సభ్యులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు మోడల్‌ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 809 62 26651 నంబరులో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్‌ వేటు

కుల్కచర్ల: ఓ ఇంటిపై దాడి చేసిన ఘటనలో ఏ1గా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్‌ వేటుకు గురయ్యారు. బుధవారం చౌడాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బసయ్యకు సస్పెన్షన్‌ ఉత్తర్వులు అందజేశారు. ఇటీవల కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన మరో కుటుంబంపై తన సహచరులతో కలిసి దాడికి పాల్పడిన ఘటనలో కేసు నమోదు కావడంతో పాటు రిమాండ్‌కు వెళ్లారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయినట్లు చౌడాపూర్‌ ఎంఈఓ రాంచందర్‌ పేర్కొన్నారు.

సీఎం ఇంటికి 'సర్వే' స్టిక్కర్‌

బంజారాహిల్స్‌: ముఖ్యమంత్రి ఇంటికి సర్వే స్టిక్కర్‌ పడింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం ఎన్యూమరేటర్లు జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–44లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఇంటి నెంబర్‌, కుటుంబ యజమాని పేరు, ఆదాయ, కుల తదితర వివరాలను నమోదు చేసుకున్నారు.

తలపై రాడ్‌తో మోది వ్యక్తి హత్య

- క్లీనర్‌ను చంపేసిన డ్రైవర్‌
- అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు

బొంరాస్‌పేట: పని వద్ద తలెత్తిన వివాదాల కారణంగా ఓ క్లీనర్‌ తలపై రాడ్‌తో మోది డ్రైవర్‌ హత్య చేసిన ఘటన కొడంగల్‌ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి వివరాల మేరకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అమన్‌యాదవ్‌(30), అనూష్‌ శుక్ల గత నెల 23న చేవెళ్లలో ఓ లారీ ట్రాన్స్‌పోర్టులో పనిలో చేశారు. అనూష్‌ శుక్ల డ్రైవర్‌గా, అమర్‌ యాదవ్‌ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో యూపీలో ఉన్న అనూష్‌ శుక్ల ప్రియురాలికి అమన్‌ ఫోన్‌ చేసి సతాయించేవాడు. తాజాగా శుక్లాను చంపేస్తానని ఆయన ప్రియురాలికి అమర్‌ హెచ్చరించాడు. శుక్లాకు ప్రియురాలు ఫోన్‌ చేసి విషయం చెప్పి అప్రమత్తం చేసింది. దీపావళి నాడు ఇద్దరి మధ్య గొడవ జరిగితే పొరుగువారు సముదాయించారు. తాండూరు నుంచి షాద్‌నగర్‌ కొత్తూరుకు లోడ్‌తో బయలు దేరారు. మరుసటి రోజు రాత్రి లారీలో వెళ్తుండగా డ్రైవర్‌గా ఉన్న శుక్లా నిద్రలో ఉన్న అమన్‌ యాదవ్‌ను రాడ్‌తో తలపై గట్టిగా కొట్టాడు. తుంకిమెట్ల సమీపంలో కల్వర్టు వద్ద శవాన్ని పారవేసి వెళ్లాడు. అనుమానాస్పద మృతిగా ఎస్సై ఎండీ అబ్దుల్‌ రవూఫ్‌ కేసు నమోదు చేయగా ఛేదించినట్లు తెలిపారు. పారిపోతున్న నిందితుడిని బుధవారం తాండూరు రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నామని సీఐ చెప్పారు.

కాంగ్రెస్‌ మాట నిలబెట్టుకుంది

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ

పరిగి: కాంగ్రెస్‌ మాట ఇస్తే తప్పకుండా నిలబెట్టుకుంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ, జాతీయ కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌ పేర్కొన్నారు. ప్రభుత్వం కులగణన, విద్యార్థులకు స్కాలర్‌ షిప్‌, మెస్‌ చార్జీలు పెంచడంతో బుధవారం పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యార్థులకు, బీసీ కులగణన చేపడతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నెరవేరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి విద్యార్థుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు చాలీచాలని మెస్‌ చార్జీలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించిందన్నారు. ప్రభుత్వం కులగణన చేపట్టడంతో రాష్ట్రంలోని బీసీలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాజకీయంగా అన్ని విధాల వెనుకబడిన వర్గాలకు లాభం చేకూరుతుందన్నారు. బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ కల్పించేందుకు కులగణనను ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, మాజీ వైస్‌ ఎంపీపీ సత్యనారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు అశోక్‌, నాయకులు నరసింహ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, బీసీ సంఘ నాయకులు

మహిళల భద్రతే ముఖ్యం



యాలాల: విద్యార్థిని అభినందిస్తున్న డీఎస్పీ

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల: మహిళలు, బాలికల భద్రత కోసమే షీ టీం ఏర్పాటు చేశారని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకులంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు షీ టీం ఆధ్వర్యంలో పోలీసుల కళాజాత బృందతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు వాడకం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా డ్రంకన్‌ డ్రైవ్‌ చేయరాదన్నారు. ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్‌ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లకు పంపించే లింక్‌లను తెరిచి సమస్యలు కొని తెచ్చుకోకూడదన్నారు. బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, డయల్‌ 100 లాంటి అత్యవసర సేవల గురించి వివరించారు. అనంతరం పలువురు విద్యార్థునుల కరాటే ప్రతిభ పోలీసుల ఎదుట ప్రదర్శించారు. ఈ మేరకు డీఎస్పీ ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో రూరల్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్‌, షీ టీం ఇన్‌చార్జి శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సైబర్‌ క్రైమ్‌ డీఎస్పీ ప్రశాంత్‌

తెలియని లింక్‌లు ఓపెన్‌ చేయొద్దు

పరిగి: సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లను ఓపెన్‌ చేస్తే బ్యాంకులో ఉన్న డబ్బులు మొత్తం ఖాళీ అవుతాయని సైబర్‌ క్రైమ్‌ డీఎస్పీ ప్రశాంత్‌ హెచ్చరించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని సైబర్‌ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమాయకులే టార్గెట్‌గా ఆశలు చూపి సైబర్‌ క్రైమ్‌కు పాల్పడుతారన్నారు. ముందుగా మిమ్మల్ని నమ్మించి మోసం చేస్తారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిత్యం సైబర్‌ క్రైమ్‌లపై అవగాహన కల్పిస్తున్నా ఏదో ఒక రూపంలో నేరాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మారుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుని సైబర్‌ క్రైం నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తమ దగ్గర ఉన్న ఏటీఎం, ఏ పిన్‌లను కూడా ఇతరులకు చెప్పరాదని సూచించారు. ప్రతిఒక్కరూ సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు

జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి డీజీ శీతల్‌



మాట్లాడుతున్న న్యాయమూర్తి

అనంతగిరి: మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్‌ సూచించారు. ఈమేరకు బుధవారం వికారాబాద్‌లోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో చట్టాలపై జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మైనర్లయితే వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే న్యాయపరంగా చిక్కులు ఎదురవుతాయన్నారు. వాహనదారులు తమ వాహనాలకు ప్రమాద బీమా ఉండేటట్లు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ న్యాయవాది వెంకటేష్‌, డిప్యూటీ లీగల్‌ఎయిడ్‌ పి.రాము, న్యాయవాది రాజశేఖర్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు కరుణాకర్‌, జనార్దన్‌రెడ్డి, విజయలక్ష్మి, మహేశ్వరి, సరస్వతి, హరిచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

శిల్పా లేఔట్‌ భూముల క్రమబద్ధీకరణపై స్టేటస్‌కో

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో శిల్పా లేఔట్‌ భూముల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టేటస్‌ కో విధించింది. సర్వే నంబర్‌ 32 నుంచి 40లో ఉన్న దాదాపు 99,013 చదరపు గజాల స్థలం విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శిల్పా లేఔట్‌గా పిలిచే స్థలాన్ని ఫినిక్స్‌ ఇన్ఫోసిటీ, శిల్ప పయనీర్‌కు క్రమబద్ధీకరించే యత్నాలకు బ్రేక్‌ పడింది. ఈ 99,013 గజాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ కలెక్టర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి 2023 జూలైలో జారీ చేసిన మోమోను సవాల్‌ చేస్తూ సయ్యద్‌ ఖాజాం హుస్సేన్‌తో పాటు మరో 144 మంది హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. 2008లోని జీవో 166, 2014లోని జీవో 58, 59ల కింద ఈ స్థలంలో ఉంటున్న పేదలు స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది జెల్లి కనకయ్య వాదనలు వినిపించారు. గుడిసెలు వేసుకుని ఉంటున్న ఈ పేదలంతా క్రమబద్ధీకరణకు అర్హులన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గురునాథ్‌రెడ్డి

కొడంగల్‌: మండల పరిధిలోని హస్నాబాద్‌, పెద్ద నందిగామ, మున్సిపల్‌ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డులో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను నేతలు ప్రారంభించారు. కొడంగల్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గురునాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలన్నారు. ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభిస్తుందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మూడు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్‌) ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు పీఏసీఎస్‌ అధ్యక్షుడు శివకుమార్‌ గుప్తా తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అంబయ్యగౌడ్‌, తహసీల్దార్‌ విజయకుమార్‌, ఏఓ లావణ్య, సీఈఓ రఘుపతి, కౌన్సిలర్‌ బీఎం రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురండి

తాండూరు రూరల్‌: వరి కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని డీసీఎంఎస్‌ తాండూరు బ్రాంచ్‌ ఇన్‌చార్జి ఎల్లయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెంగోల్‌ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. వరి ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు తాలు లేకుండా, బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. క్వింటాలు ఏ గ్రేడ్‌ రకానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 ధరను ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. చెంగోల్‌ కొనుగోలు కేంద్రానికి గౌతపూర్‌, చింతమణిపట్నం, పర్వాతపూర్‌, బెల్కటూర్‌, రాంపూర్‌ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాముయాదవ్‌, కృష్ణయ్య, నర్సింహారెడ్డి, ఖాసీం, మైబు, నాగరాజు, నర్సిములు పాల్గొన్నారు.



తాండూరు రూరల్‌: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్లయ్య